# మరణపు ముల్లు

ఆ ప్రదేశం నాకు కొత్త కాకపోయినా ఆ ఇల్లు కనుక్కోటానికి అటూ ఇటూ తిరిగి ఇబ్బంది పడవలసి వచ్చింది. ఆ వీధిలో ఇంటి నెంబర్లు ఒక క్రమంలో లేవు. అటు పక్కకొచ్చి ఆరునెలలవుతోంది. రోడ్డుమీది గోతుల్లో తప్ప నాకు ఎందులోనూ అభివృద్ధి కనిపించలేదు. అది అర్జంటు టెలిగ్రాం అయి ఉండకపోతే టెలిగ్రాఫ్ ఆఫీసు నుండి ఆ సమయంలో కష్టపడుతూ వచ్చి ఉండే వాడినికాను. ఆ టెలిగ్రాం మరుసటి రోజు ఉదయం బట్వాడా అయి ఉండేది.

సైకిలు స్టాండు వేసి టార్చిలైటు వెలుగులో కాంపౌండ్ గేటు మీద రాసి ఉన్న పేరు వంక చూశాను. ""వి. రామలింగం" ఇంటినెంబరు కనిపించిన తర్వాత నేను ఆ ఇల్లు పట్టుకోటానికి పడిన కష్టమంతా మర్చిపోయాను. ఇంటి నెంబరు కింద 'కుక్కలున్నాయి జాగ్రత్త' అని రాసి ఉన్న బోర్డు ఉంది. నాకు కుక్కలంటే భయం లేదు. ఇష్టపడతాను. ఎంతటి కుక్కనయినా త్వరగా మచ్చిక చేసుకోగలను.

ఇనప తలుపు నెట్టాను. కీచుమని చప్పుడు చేస్తూ తలుపు తెరుచుకుంది. లోపలికి నడిచాను. గాలి చల్లగా వీస్తోంది. వర్షం వచ్చేట్టుంది. దారంతా గులకరాళ్లు చలికి ఆరబోసినట్లుగా ఉన్నాయి. దారికిరుపక్కలా పిచ్చి మొక్కలు ఏ ఆలనా పాలనా లేక ఇష్టం వచ్చినట్లు పెరిగి ఉన్నాయి. గోడ పక్కగా ఉన్న మొక్కలు ఎండి పోయి ఉన్నాయి.

రెండు మెట్లెక్కి వీధి తలుపు ముందాగి తలుపు తట్టాను. లోపలి నుండి ఎటువంటి శబ్దం వినిపించలేదు. రెండు నిమిషాలు ఆగి తలుపు మళ్లీ తట్టాను. ఏ చప్పుడూ వినిపించలేదు. చేతి గడియారం వంక చూసుకున్నాను. పన్నెండు కావస్తోంది. టెలిగ్రాం అందజేస్తే ఈ రాత్రికి నాకు వేరే పనేమీ ఉండదు. ఆఫీసు చేరుకుని కొద్ది సేపు నిద్రపోవచ్చు. పగటిపూట డ్యూటీల కంటే రాత్రిపూట డ్యూటీలు నాకు ఇష్టం. కావాలని వేయించుకుంటాను. అట్టే పని ఉండదు. మా సూపర్వైజరు మంచివాడు. ఏవిషయాన్నీ సీరియస్‌గా తీసుకోడు. ఏ సమస్య వచ్చినా మమ్మల్ని ఆదుకుంటుంటాడు.

తలుపు మళ్లీ తడదామనుకునేంతలో లోపలి నుండి ఎవరో కదిలిన చప్పుడు వినిపించింది. తలుపు తెరుచుకోలేదు. దొంగల భయం వలన ఇంత రాత్రప్పుడు తలుపు

తట్టి, 'మీకు టెలిగ్రాం వచ్చిందంటే' చాలామంది వెంటనే తలుపు తీయరు. 'ఎక్కడ నుండి వచ్చింది? ఎవరిచ్చారు? టెలిగ్రాంలో ఏముంది?' ప్రశ్నలు వేసి మా సమాధానాలతో తృప్తి పడితేనే గాని తలుపు తీయరు. కొంతమంది తలుపు తీయకుండా తలుపు సందుల్లోంచి కాని, కిటికీలోంచి కాని తీసుకుంటుంటారు. తీసుకున్నాక తీసుకున్నట్టు కొంతమంది సంతకం పెడతారు. కొంతమంది పెట్టరు. ఎందుకు పెట్టరో నాకు అర్థం కాదు. మరి ఈయన తలుపు తీస్తాడో, లేదో?

గదిలో లైటు వెలిగింది. అడుగుల చప్పుడు తలుపు వరకు వచ్చి ఆగింది. "ఎవరూ?" గట్టిగానే అడిగాడు. కంఠస్వరం బొంగురుగా ఉంది.

"టెలిగ్రాఫ్ ఆఫీసు నుండి వస్తున్నానండీ, రామలింగం గారికి టెలిగ్రాం వచ్చింది... నా మాటలు పూర్తి కాలేదు. తలుపు గడి తీసిన చప్పుడు వెనకే తలుపు తెరుచుకుంది. అట్టే ఆలస్యం చేయకుండా తలుపు తెరుచుకున్నందుకు సంతోషం వేసింది.

గదిలోని వెలుగు మసకగా ఉంది. తలుపు తెరిచి ఆనుకుని నిలబడిన ఆయన వంక చూశాను. ఆయనకు అరవై అయిదేళ్ళ వయసు ఉంటుంది. మనిషి సన్నగా ఉన్నాడు. తెల్లటి లాల్చి, పంచ తొడుక్కున్నాడు. మెడచుట్టూ ఎర్రటి మఫ్లరుంది. నీడకు మనిషి ముఖం నాకు స్పష్టంగా కనిపించటం లేదు.

జేబులోంచి టెలిగ్రాం తీసి ఆయనకు ఇవ్వబోతుంటే "విప్పి చదువు బాబూ. నా కళ్లద్దాలు పైన ఉన్నాయి" అన్నాడు.

టెలిగ్రాం విప్పాను. మనసులో చదువుకుని తల పైకెత్తాను. ఆయనకు అది మంచివార్త కాదు. "రామలింగం గారు మీరేకదూ?" అడిగాను.

"అవును బాబూ."

"సాయిబాబు మీకు ఏమవుతాడు?"

"మా అబ్బాయి. బొంబాయిలో ఉంటున్నాడు."

"ఈ టెలిగ్రాం బొంబాయి నుండి వచ్చింది" నెమ్మదిగా అన్నాను. టెలిగ్రాంలో ఉన్న వార్త ఆయనకు ఎలా చెప్పాలో అర్థం కావటం లేదు. తటపటాయిస్తుంటే, "కేన్సరు ఆస్పత్రి వాళ్ళిచ్చారా?" అసహనంగా అడిగాడు.

టెలిగ్రాం కింద చూసి, "అవును" అన్నాను.

ఆయన దీర్ఘంగా నిట్టూర్చి రెండు క్షణాలు మౌనంగా ఉండి, "సాయి ఎప్పుడు పోయాడట?" గొంతు నిండిన బాధతో అడిగాడు.

"ఈ రాత్రి తొమ్మిదింటికి."

"ఫ్చ్... వాడు కూడా వెళ్ళిపోయాడు... ఎన్ని బాధల్ని తట్టుకోను?... చెప్పు.... ఎక్కడ సంతకం పెట్టమంటావు?"

"ఆస్పత్రి వాళ్లు ఇంకేదో మెసేజ్ ఇచ్చారు."

"నేను చూసుకుంటానులే."

టెలిగ్రాం ఆయనకు అందించాను. టెలిగ్రాం మడిచి లాల్చీ జేబులో పెట్టుకున్నాడు. బాల్‌పెన్ తీసి ఆయన కిచ్చి "నాలుగో నెంబరు ఎదురుగా సంతకం పెట్టండి" అన్నాను. సంతకం చేసి నేనిచ్చిన కాయితం బాల్‌పెన్ తిరిగి ఇచ్చేస్తుంటే ఆయన సన్నటి చేతులు వణకటం గమనించాను. ఆయన మీద జాలి వేసింది. ఎదిగొచ్చిన కొడుకు పోయాడంటే నాకే బాధగా ఉంది. ఆయనెంత బాధ పడుతున్నాడో? దుఃఖంలో ఉన్న ఆయన్ని వెంటనే వదిలి వెళ్లాలనిపించలేదు. కాయితాన్ని జేబులో పెట్టుకుని, "మీ సాయి వయసు ఎంత ఉంటుందండీ;?" అడిగాను.

"ముప్ఫయి అయిదు."

"చిన్న వయసే. పెళ్లి అయిందా?" నా ప్రశ్నలకు ఆయన విసుక్కుంటాడనుకున్నాను కాని నా మాటల్లోని సానుభూతికి ఆయన బాధ చల్లబడుతూ ఉందనుకుంటాను.

"కాలేదు. తొమ్మిది, పది సంవత్సరాల కిందట ఎవరో అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయిని నాకు చూపించాడు. చాలా బావుంది. నేను ఎటువంటి అభ్యంతరం చెప్పలేదు. 'సరే' అన్నాను. మా ఆవిడకు కూడా చూపించాడు. మా ఆవిడ ఒప్పుకోలేదు. ఆ అమ్మాయిని సాయి చేసుకోటానికి వీల్లేదన్నది. కారణం నాకూ చెప్పలేదు. మావాడికీ చెప్పలేదు. 'నాకు ఇష్టంలేదు. అంతే ' అంది. మా ఇంట్లో ఆవిడ మాట ఎవరూ జవదాటరు. వాడి పెళ్లి ఆ అమ్మాయితో జరగలేదు. ఆ తర్వాత మా ఆవిడ వాడి కోసం నాలుగయిదు సంబంధాలు తీసుకు వచ్చిందికాని సాయి దేనికీ ఒప్పుకోలేదు. నేను జోక్యం చేసుకోలేదు. ఆ తర్వాత పెళ్లి మాట ఎవరెత్తినా సాయి మండి పడేవాడు. సాయికి మా ఆవిడ మీద కోపం. నామీద కోపం. సిగరెట్లు మీద సిగరెట్లు కాల్చేవాడు. రోజుకు కనీసం పదిహేను పేకెట్లు తాగేవాడు. జబ్బు మొదలయ్యాక సిగరెట్లు ఇంకా ఎక్కువ తాగటం మొదలెట్టాడు. డాక్టరు చెప్పి చెప్పి విసుగెత్తి ఊరుకున్నాడు. జబ్బు బాగా ముదిరి పోయాక డాక్టరు వాడిని ఒప్పించి బొంబాయి పంపించాడు. మూడో స్టేజిలో ఉన్న జబ్బు ఎందుకు లొంగుతుంది? ఈ ఇంట్లో ఇద్దరు మొండి మనుషుల మధ్య నలిగిపోయాను.. ఈ బాధ మరెవరూ పడకూడదు" ఆగాడు.

"మీకు ఎంతమంది పిల్లలు?"

"సాయి ఒక్కడే."

నా మనసు బాధతో నిండిపోయింది. "రాత్రి రెండింటికి బొంబాయికి ఎక్స్‌ప్రెస్ ఉంది. మీరిప్పుడు బయల్దేరితే బండి దొరుకుతుంది. కావాలంటే సెంటరు వరకు వెళ్లి రిక్షా తీసుకువస్తాను" అన్నాను.

ఆయన తల అడ్డంగా ఆడించి, "నేను బొంబాయి ప్రయాణం చూసే పరిస్థితిలో లేను. మా ఆవిడకు ఏం బావోలేదు. పైన పడుకుని ఉంది. అన్నీ మంచంలోనే చేసుకుంటోంది. ఆవిడ పరిస్థితి కూడా ఇవేళో, రేపో లా ఉంది. ఆ అవసానదశలో ఆవిడను వదిలి వెళ్లలేను" అన్నాడు.

"ఆవిడను ఆస్పత్రిలో చేర్పించక పోయారా?"

"రెండురోజుల కిందటే ఆస్పత్రి నుండి తీసుకువచ్చాను. లాభం లేదని డాక్టర్లు చెప్పినా రెండు రోజులు బాగానే ఉంది. ఈ సాయంత్రం నుండి జబ్బు తిరగబెట్టింది."

ఈ పరిస్థితిలో నేను ఆయనకు చేయగలిగింది ఏమీ లేదనిపించింది. సంభాషణ మళ్లించటానికి , "నాకు దాహం వేస్తోంది. మంచి నీళ్లు ఇవ్వగలరా?" అడిగాను.

"ఇప్పుడే తీసుకువస్తాను" అని లోపలికి వెళ్లాడు.

మధ్య గదిలోకి నడిచి చుట్టూ చూశాను. గది మధ్యలో సోఫా సెట్ ఉంది. కుడి పక్క గోడకానుకుని డైనింగ్ బల్ల ఉంది. గది శుభ్రంగా లేదు. చాలారోజుల నుండి గది ఊడ్చినట్టుగా లేదు. ఎదురుగా ఉన్న గోడకు రెండు పటాలు వేలాడుతున్నాయి. ఒక పటం కింద గోడ పెచ్చులు ఊడి ఇటుకలు కనిపిస్తున్నాయి. గది మూలల్లో బూజుపట్టి ఉంది. గది ముక్క వాసన వేస్తోంది.

పది నిమిషాల తర్వాత ఆయన గాజుగ్లాసులో నీళ్లు తీసుకువచ్చి నాకందించాడు. నీళ్లు తాగబోతూ ఆగాను. నీళ్లు శుభ్రంగా లేవు. తలెత్తి ఆయన ముఖంలోకి చూశాను. ఆయన కనుబొమలు దట్టంగా ఉన్నాయి. కళ్లు లోతుగా, ఎర్రగా ఉన్నాయి. ముక్కు పొడుగ్గా, లావుగా ఉంది. మీసాలు గుబురుగా ఉన్నాయి.

నా కుడిచేయి ముందుకు చాపి, "నీళ్లు శుభ్రంగా లేవు" అన్నాను. మాట ముగించానో లేదో నా చేతిలోని గ్లాసు విసురుగా తీసుకుని బల్లమీద పెట్టి, "నాలుగు రోజుల నుండి మా కుళాయిలో నీళ్లు రావటం లేదు. దయచేసి ఏమనుకోకు... కూర్చో. నీకో సంగతి

చెప్పాలి" అని కుర్చీలాగి కూర్చుని నన్నూ కూర్చోమని చేత్తో సైగ చేశాడు. దుమ్ముతో ఉన్న కుర్చీలో కూర్చోవటం ఇష్టం లేక, "పర్వాలేదు. చెప్పండి" అన్నాను.

"నీకు నీళ్లు తీసుకువద్దామని వంటగదిలోకి వెళ్లాను. బిందెల్లో నీళ్లులేవు. పైకి వెళ్లాను. పైన కూజాలో నీళ్లున్నాయి. కూజాలోంచి గ్లాసులోకి నీళ్లు వంపుకుని తిరిగి రాబోతూ మా ఆవిడ ముఖంలోకి చూశాను. ప్రశాంతంగా ఉంది. నాకెందుకో అనుమానం వేసి నాడి చూశాను. నాడి అందలేదు. ఊపిరి ఆడటంలేదు. గుండె కొట్టుకోవటం లేదు. చివరిక్షణంలో ఆవిడ దగ్గిరలేను. కింద నీతో మాట్లాడుతున్నప్పుడే చనిపోయి ఉండాలి." నెమ్మదిగా అని నవ్వాడు.

ఉలిక్కి పడ్డాను. ఆయన ముఖంలోకి చూశాను. ఆయన మనసారా నవ్వుతున్నాడు. ఆ నవ్వులో నాకు ఎటువంటి బాధా అవుపించటం లేదు. షాక్ మీద షాక్‌తో ఆయన మనసు మొద్దుబారి పోయి ఉండాలి. ఆయన మీద జాలితో ఆయన చేతులమీద నా కుడిచేయి వేసి, "అయాం సారీ" అన్నాను. ఆయనను ఎలా ఓదార్చాలో నాకు అర్థం కావటం లేదు. రెండు నిమిషాల పాటు ఆయన చేతులు నిమురుతూ చివరకు, "మీకు ఎటువంటి సహాయం కావాలో చెప్పండి. చేసి పెడతాను. మీ బంధువుల కెవరికయినా టెలిగ్రాంలు ఇవ్వమంటే అడ్రసులు ఇవ్వండి. ఇస్తాను. ఈ ఊళ్ళో మీ వాళ్లకెవరికయినా ఈ మరణవార్తలు తెలియజేయమంటే చేస్తాను. మీరు సంకోచించకండి" అన్నాను.

ఆయన తల అడ్డంగా ఆడించి, "వద్దు. నేను నీకు ఎటువంటి ఇబ్బంది కలిగించదల్చుకోలేదు. తెల్లవారాక నా బాధలు నేను పడతాను... ఈ రోజు విశేషం ఏమిటో కాని ఒకటి గాదు, రెండుకాదు, మూడు చావులు... ఒక్కరోజులో..." అని ఈసారి పెద్దగా నవ్వాడు.

"మూడా?"

"బొంబాయిలో మావాడు చనిపోయాడా? ఇక్కడ మా ఆవిడ పోయింది. ఈ ఉదయం మా ఇంటికుక్క టామీ చచ్చిపోయింది. టామీ చచ్చిపోయినప్పుడే ఇవేళ ఏదో ఉందని అనుమాన పడుతూ వచ్చాను. నా అనుమానం నిజం అయింది. టామీ చచ్చిపోయినట్లు చెప్పకూడదనుకుంటూనే మా ఆవిడతో ఈ సాయంత్రం చెప్పకుండా ఉండలేకపోయాను. చెప్పకుండా ఉండాల్సింది. పొరపాటు చేశాను. టామీ అంటే మా ఆవిడకు ఎంతో ఇష్టం. దాన్ని చూసుకున్నంత ప్రేమగా మా సాయిని ఎప్పుడూ చూడలేదు..." అంటుంటే ఆయన మాటలకు అడ్డుతగిలి, "ఆ ఫోటో మీ టామీదేనండీ?" అడిగాను గోడకున్న ఫోటో చూపిస్తూ.

"అవును."

"మీకు తోడుగా తెల్లవారేవరకు ఉండమంటారా?"

"వద్దు. నువ్వు వెళ్ళిపోవచ్చు" అని రెండు చేతులతో ముఖం కప్పుకున్నాడు.

"నేను వెళ్తున్నానండీ" అన్నాను. ఆయన నామాట విన్నట్టులేదు. రెండుక్షణాలపాటు ఆయన వంక మౌనంగా చూసి బయటకు వచ్చాను. వీధితలుపు దగ్గిరగా వేస్తూ లోపలికి తొంగిచూశాను. ఆయన వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. తలుపు మూసి బరువెక్కిన హృదయంతో కాంపౌండ్ గేటు దాటి, గేటు మూసి, సైకిలు ఎక్కి టార్చిలైటు వెలుగు ఆ ఇంటిమీదకు వేశాను. ఆశ్చర్యం! ఆ ఇల్లు పెంకుటిల్లు. పైన డాబాలేదు. ఆయన మాటిమాటికి పైన అని ఎందుకన్నాడో నాకు అర్థం కాలేదు. ఇంటివెనక చింతచెట్టు ఉంది. చింతచెట్టు కొమ్మల్లోంచి రెండు కళ్ళు ఎర్రగా కనిపించేసరికి నాకు ఆయన కళ్లు గుర్తు వచ్చాయి. పొరపాటున అలా అనిపించిందేమోనని మళ్లీ చూశాను. లేదు. నేను పొరపడటం లేదు. నా గుండె ఝల్లుమంది. చింతచెట్టు మీద కూర్చున్నది మనిషో, కుక్కో అర్థం కావటం లేదు. తెల్లగా ఉంది. మెడకు ఉంది మఫ్లరో, బెల్టో తెలియటం లేదు. వెన్నులో బయల్దేరిన భయం గడ్డకట్టుకుంటూ ఒళ్ళంతా పాకిపోయింది. క్షణం ఆలస్యం చేయకుండా రోడ్డుమీద కొచ్చి సైకిలు వేగంగా తొక్కటం మొదలెట్టాను.

కొద్దిదూరం వెళ్లాక నావెనక ఎవరో పరుగెత్తుతున్న చప్పుడు వినిపించటం మొదలయ్యాక నా భయం ఎక్కువకాసాగింది. వెనక్కి తిరిగి చూడటానికి కూడా ధైర్యం చాలటం లేదు. సైకిలు వేగం పెంచాను. నన్ను వెంబడిస్తున్న చప్పుడు కూడా వేగం పుంజుకుంది. రెండుక్షణాల తర్వాత నా కాలు పట్టుకునే ప్రయత్నం జరిగేసరికి ధైర్యం కూడ గట్టుకుని దృష్టి వెనక్కు సారించాను. తెల్లటి అల్సేషన్ కుక్క సైకిలు వెంబడే పరుగెడుతోంది. నాకు కుక్కలంటే భయంలేదు. ఆగితే ఏం చేయదన్న నమ్మకం కుదరటం లేదు. ఒక చేత్తో హేండిలు పట్టుకుని మరోచేత్తో టార్చి వెలిగించి దాని ముఖం మీద వేశాను. దాని కనుబొమలు దట్టంగా ఉన్నాయి. కళ్లు ఎర్రగా ఉన్నాయి. మూతి పొడుగ్గా ఉంది. అది నేను ఆ ఇంటిలో చూసిన ముసలాయనలా ఉంది. టామీ అదేనేమో! చచ్చిపోయిన టామీ నావెంట ఎందుకు పరుగెడుతోంది? అసలు రామలింగం కూడా బతికిలేడా?

కుక్క ఎగిరి నా కాలు పట్టుకుంది. దాని పళ్లు నా కాలి పిక్కలోకి దిగబడ్డాయి. రక్తం కారుతుందో లేదో తెలియటం లేదు. విదిలించుకుని కుక్క ఉన్న వైపు కాలు పైకెత్తాను. ఎగిరి పేంటు పట్టుకునేసరికి పేంటు చిరిగింది. ఎక్కడ లేని భయంతో చేతులు

వణుకుతున్నాయి. టార్చి చేతిలోంచి జారికింద పడిపోయింది. కుక్క నా మీదపడి నానా బీభత్సం చేస్తుందేమో తెలియటం లేదు. అరవటానికి గొంతు పెగలటం లేదు. చావు ధైర్యంతో కాలితో బలంగా దాని మూతి మీద కొట్టాను. కుక్క ఎగిరి అవతల పడింది. అదే ఆవీధి చివర. మెయిన్ రోడ్డుమీద కొచ్చాక నేనూ ఆగలేదు. వెనక్కి తిరిగి చూడలేదు. సెంటరు చేరుకునే వరకు సైకిలు వేగాన్ని తగ్గించలేదు.

సెంటర్లో ఇరానీ రెస్టారెంటు ఇంకా తెరిచే ఉంది. సైకిలు ఆపి స్టాండు వేసి చెమటతో తడిచిన చొక్కా గుండీలు ఒక్కక్కటే విప్పుకుంటూ లోపలకు నడిచి ఫేను కింద కూర్చున్నాను.

అలుపు తగ్గి మామూలు స్థితికి రావటానికి అరగంట పైనే పట్టింది. అయిదో సిగరెట్ వెలిగించి మూడో టీ తాగుతూ ఆలోచనల్లో పడ్డాను. ఈ నా అనుభవం గురించి ఎవరికి చెప్పినా నమ్మరు. భ్రమగా కొట్టి పారేస్తారు. ఎవరి వరకో ఎందుకు? నా మటుకు నాకు భ్రమ లానే అనిపిస్తోంది. లేకపోతే లేనివి నేనూహించుకున్నానా? నా కాలి పిక్క మీద ఎటువంటి గాయాలు లేవు. నా పేంటు బాటం చిరగలేదు. అయితే నేను రామలింగానికి టెలిగ్రాం ఇవ్వటం, ఆయన సంతకం పెట్టటం, సాయి చనిపోవటం ఏవీ భ్రమకాదు. కానేకాదు. (క్రిస్‌మెస్సీ ఆంగ్ల కథ చదివాక)

◆ విజయ, మాసపత్రిక, మే - 1984